## వర్ధన్నపేట ఇల్లంద గ్రామంలో రైతు

# ఆర్ధిక నష్టంతో ఆత్మహత్య

**వర్ధన్నపేట/డిసెంబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ఇల్లంద గ్రామ రైతు మైదం రాకేష్ ఆర్థిక నష్టాల భారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.ఇల్లంద గ్రామానికి చెందిన మైదం రాకేష్ (28), తండ్రి: రాములు, వృత్తి: వ్యవసాయం, కులం మున్నూరు కాపు, తన పొలాల్లో పంట సాగిస్తూ అదనంగా 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంట చేస్తుండేవాడు. కానీ ఈ ఏడాది పంటకు అకాల వర్షం తీవ్ర దెబ్బ తీయడంతో మొత్తం పంట నష్టం వచ్చి రాకేష్ తీవ్ర ఆందోళనలో పడ్డాడు.నిన్న గురువారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఇల్లంద గ్రామ శివారులో కలుపు మందు తాగి రాకేష్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆ దారి వెంబడి వస్తున్న బాటసారుడు రాకేష్ పరిస్థితిని గమనించి, మైదం రాములు (కొమరయ్య సంతానం) కు సమాచారమిచ్చాడు.తన కుమారుణ్ని వెంటనే 108 రోగి తరలింపు వాహనం ద్వారా వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని మెడికల్ హాస్పిటల్‌కు తరలించగా, రాకేష్ శుక్రవారంఉదయం 9:40 గంటలకు మృతి చెందాడు. ఎస్సై ఐ ఎన్. సాయి బాబు మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.గ్రామస్థులు, రైతు సంఘాలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. పంట నష్టాల కారణంగా మానసిక ఒత్తిడికి లోనైన రైతుల కోసం ప్రత్యేక సహాయ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరంపై స్థానికుల మధ్య చర్చలు మొదలయ్యాయి. అటువంటి ఆర్థిక ఒత్తిడులు తల్లితండ్రులను మాత్రమే కాకుండా మొత్తం గ్రామ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయని, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.